‘మెడికల్ పీజీ’ ఆగమాగం

మొదటిపేజీ తరువాయి...

కోటా అమలవుతుండగా.. మిగతా 50 శాతం లోకల్ కోటా అమలు చేస్తున్నారు. స్థానిక కోటా కారణంగా రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులకు వెయ్యికి పైగా సీట్లలో అవకాశాలు లభిస్తున్నాయి. కానీ తాజా తీర్పుతో తెలంగాణ విద్యార్థులకు అవకాశాలు తగ్గిపోతాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే.. ఉత్తరాది కన్నా దక్షిణాది రాష్ట్రాల్లోనే మెడికల్ కాలేజీలు, పీజీ సీట్లు ఎక్కువగా ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఆలిండియా కోటాలో జరుగుతున్న అడ్మిషన్లను పరిశీలిస్తే ఉత్తరాది విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారని చెప్తున్నారు. భవిష్యత్తులోనూ ఇదే కొనసాగితే తెలంగాణ విద్యార్థులకు నష్టం తప్పదని పేర్కొంటున్నారు.

స్థానికంగా నిపుణుల కొరత

సుప్రీంకోర్టు గతంలోనే సూపర్ స్పెషాలిటీ సీట్లలో స్థానిక కోటాను రద్దు చేసింది. తాజాగా పీజీలోనూ స్థానిక కోటాను రద్దు చేయడంతో లోకల్‌గా నిపుణుల కొరత ఏర్పడుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్, పీజీ, సూపర్ స్పెషాలిటీ చదివే విద్యార్థుల్లో అత్యధిక శాతం మంది తెలంగాణలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు స్థానిక కోటా రద్దుతో పీజీ సీట్లలో ఎక్కువగా ఇతర రాష్ట్రాల వారే చేరే అవకాశం ఉంది. దీంతో పీజీ కోర్సు అయిపోయిన తర్వాత వారు తమ సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతారని, దీంతో స్థానికంగా నిపుణుల కొరత ఏర్పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ దవాఖానలకు నోటిఫికేషన్లు వెలువడినప్పుడు దరఖాస్తు చేసే వారి సంఖ్య కూడా తగ్గుతుందని విశ్లేషిస్తున్నారు.

‘ఇన్ సర్వీస్’ కోటాపై ప్రభావం?

ప్రస్తుతం ఎంబీబీఎస్ పూర్తి చేసి, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ దవాఖానాల్లో సేవలు అందించే డాక్టర్లకు ఇన్ సర్వీస్ కోటా కింద పీజీ సీట్లలో అవకాశం కల్పిస్తున్నారు. లోకల్ క్యాటగిరీలో కన్వీనర్ కోటా కింద వచ్చే సీట్లలో ఈ రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. క్లినికల్ సీట్లలో 20 శాతం, నాన్ క్లినికల్ సీట్లలో 30 శాతం ఇన్ సర్వీస్ కోటా కింద రిజర్వ్ చేశారు. సుప్రీంకోర్టు స్థానిక కోటాను రద్దు చేసిన నేపథ్యంలో ఇన్ సర్వీస్ కోటాపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో సూపర్ స్పెషాలిటీ సీట్లలో ఇన్ సర్వీస్ కోటా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే న్యాయస్థానాలు తిరస్కరించాయి. ఒకవేళ పీజీ సీట్లలో ఇన్ సర్వీస్ కోటా రద్దు అయితే.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ దవాఖానాల్లో పనిచేసేందుకు డాక్టర్లు దొరకడం కష్టం అవుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ సుప్రీంకోర్టు తీర్పుపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు.

నివాస ఆధారిత పీజీ మెడికల్ కోటా రద్దు

మెరిట్ ఆధారంగానే అడ్మిషన్లు ఉండాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 29: పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య కోర్సుల అడ్మిషన్లలో నివాసం ఆధారంగా రిజర్వేషన్ల కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ విధమైన రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధమని, సమానత్వ హక్కును ఉల్లంఘిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం తేల్చింది. పీజీ మెడికల్ కోర్సుల అడ్మిషన్లలో నివాస ఆధారిత రిజర్వేషన్లను రద్దు చేస్తూ, ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. పీజీ మెడికల్ కోర్సుల అడ్మిషన్లు కచ్చితంగా మెరిట్ ఆధారంగా ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పు ఇప్పటికే మంజూరు చేసిన రిజర్వేషన్లను ప్రభావితం చేయదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ‘పీజీ మెడికల్ కోర్సుల్లో రెసిడెన్స్ ఆధారిత రిజర్వేషన్లు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-14కు విరుద్ధం. మనమంతా భారత భూభాగంలో స్థిర నివాసులమే. ఇందులో ప్రాంతీయ, రాష్ట్ర నివాసం.. అనేవి లేవు. దేశంలో ఎక్కడైనా నివాసాన్ని ఎంచుకునే, వ్యాపారం లేదా వృత్తిని కొనసాగించే హక్కును మనం కలిగివున్నాం. భారతదేశమంతటా విద్యా సంస్థల్లో ప్రవేశాన్ని ఎంచుకునే హక్కును రాజ్యాంగం మనకు కల్పించింది’ అని ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు 2019లో నివాస ఆధారిత రిజర్వేషన్ చెల్లుబాటు కాదని తీర్పు చెప్పగా, తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, తాజాగా హైకోర్టు తీర్పును సమర్థించింది.

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఏఐ: పొంగులేటి

హైదరాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా చేయడంతోపాటు లబ్ధిదారులకు మేలు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు కృత్రిమమేధను (ఏఐ) వాడుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై బుధవారం మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశల్లో చెల్లింపులు చేస్తామని వెల్లడించారు.

తాగునీటి సమస్యలు ఉండొద్దు : సీతక్క

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వేసవికాలంలో తాగునీటి సమస్యలు తల్తెతకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఎర్రమంజిల్‌లో బుధవారం మిషన్ భగీరథపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

‘ఏఐ’తో సమగ్ర హెల్త్ ప్రొఫైల్ : శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి రాష్ట్రంలోని ప్రతి పౌరుడి సమగ్ర హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. హెల్త్ ప్రొఫైల్ అందుబాటులోకి వేగంగా మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుందని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని మాడ్యూర్ హాస్పిటల్ సర్వీసెస్ రూపొందించిన ‘ఎండీఆర్.మై డీజీ రికార్డ్’ మొబైల్ యాప్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అదనపు ఆర్థికభారాన్ని నివారించేందుకు హెల్త్ ప్రొఫైల్ దోహదపడుతుందని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మాడ్యూర్ హాస్పిటల్స్ సర్వీసెస్ చైర్మన్ మోటూరి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

రెండు నెలల్లో 19వేల ఎకరాల్లో సాగు

ఆయిల్‌పాం సాగు పెంపుపై మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలుపాలని, ఇందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఆయన ఆయిల్‌పామ్ సాగు పై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్చి నెలలోగా 19,271 ఎకరాలలో ఆయిల్‌పాం సాగయ్యేటట్టు చర్యలు తీసుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్‌పామ్ యూనిట్ నిర్మాణాన్ని జూన్‌లోగా పూర్తి చేసి ప్రాసెసింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. రైతులకు, పవర్‌లూమ్ పరిశ్రమకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరాను అందించాలని సెస్ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. చేనేత అభయ హస్తం పథకంలో భాగంగా టెస్కోకు ఇప్పటిదాకా వస్త్ర ఇండెంట్లు సమర్పించని శాఖలపై చర్య లు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

30 లక్షల చదరపు అడుగుల్లో ఉస్మానియా

26.30 ఎకరాల్లో భవనాలు: రాజనర్సింహ

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక టెక్నాలజీతో కొత్త ఉస్మానియా దవాఖానను నిర్మిస్తున్నట్టు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. దవాఖాన భవన నిర్మాణాలపై బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 26.30 ఎకరాలు, 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 2 వేల పడకల సామర్థ్యంతో ప్రజలకు దవాఖానను అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉస్మానియాలో 22 డిపార్ట్‌మెంట్లు ఉండగా.. అదనంగా మరో 8 విభాగాలను కొత్త ఉస్మానియాలో ప్రారంభిస్తామని తెలిపారు.

ట్రిపుల్‌ఆర్‌పై రెండు ఆప్షన్స్!

- నిధులు సమకూరితే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణం
- లేనిపక్షంలో కేంద్రానికి అప్పగించాలని రేవంత్ సర్కార్ నిర్ణయం

హైదరాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ): ప్రాంతీయ రింగురోడ్డు(ట్రిపుల్‌ఆర్) దక్షిణ భాగం నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం రెండు ప్రత్యామ్నాయాలు సిద్ధం చేస్తున్నది. నిధులు సమకూరితే రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మించాలని, లేనిపక్షంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)కే అప్పగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) రూపకల్పనతోపాటు ప్రాజెక్ట్ అమలుకు సమగ్ర రోడ్‌మ్యాప్ తయారీకి కన్సల్టెంట్లను నియమిస్తున్నది. ట్రిపుల్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలు రెండూ ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో నిర్మించాల్సివుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ భాగానికి సంబంధించి గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌ను మార్చి ఆర్ అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టాలని భావించింది. నిధుల సమీకరణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని గ్రహించి అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలోనే పనులు చేపట్టాలని లేఖ రాసింది. ఓవైపు కేంద్రాన్ని పనులు చేపట్టాలని కోరుతూనే, మరోవైపు డీపీఆర్‌తోపాటు పనులు చేపట్టేందుకు అవసరమైన సమగ్ర రోడ్‌మ్యాప్ తయారీకి కన్సల్టెంట్ల నియామకానికి టెండర్లు ఆహ్వానించి, ఫిబ్రవరి 14వరకు గడువు ఇచ్చింది. పనులు కేంద్రమే చేపడితే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కన్సల్టెంట్లను నియమిస్తున్నదని సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్ర వాటాపై రాష్ట్రం తర్జనభర్జన

రహదారి నిర్మాణం ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో చేపట్టినా, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించినా టోల్ ట్యాక్స్ ద్వారానే ఖర్చును పూడ్చుకోవాల్సి ఉంటుంది. ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో పనులు చేపడితే ఏ చిన్న సమస్య తలెత్తినా కేంద్రం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంటుంది కాబట్టి ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు జాప్యం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే తమ ఆధ్వర్యంలోనే నిర్మించేందుకు అవకాశాలు పరిశీలిస్తున్నది. ఇందులో భాగంగా ఏఏ మార్గాల ద్వారా నిధుల సమీకరణ చేయవచ్చు? ప్రాజెక్టు నియమ నిబంధనలు ఎలా ఉండాలి? భూసేకరణకు నిధుల సమీకరణ ఎలా? తదితర అంశాలపై సమగ్ర రోడ్‌మ్యాప్ తయారీకి రాష్ట్ర ప్రభుత్వం కన్సల్టెంట్‌ను నియమిస్తున్నది. ఒకవేళ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడితే భూసేకరణ ఖర్చులో కేంద్రం సగం వాటా భరిస్తుందా..? లేదా అనే అంశంపై ప్రభుత్వం తర్జన భర్జన పడుతున్నది. నిధులు సమకూర్చేందుకు ఆర్థిక సంస్థలు, బ్యాంకులు ముందుకొస్తే మాత్రం కేంద్రంతో పనిలేకుండా పూర్తిగా తమ ఆధ్వర్యంలోనే నిర్మించాలని, ఏ అవకాశం లేనిపక్షంలో ఎన్‌హెచ్‌ఏఐకే అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఫిబ్రవరి 2లోగా సర్వే..

మొదటిపేజీ తరువాయి...

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేని నిర్వహించిన విషయం తెలిసిందే. సదరు సర్వే నివేదిక తదితర అంశాలపై సీఎం బుధవారం ప్రత్యేకంగా సమీక్షించారు. రాష్ట్రంలో 1.16 కోట్ల కుటుంబాల ను సర్వేలో గుర్తించామని, దాదాపు 96 శాతానికి పైగా కుటుంబాల వివరాలను సేకరించామని ప్రణాళిక విభాగం అధికారులు సీఎంకి వివరించారు. కొన్ని కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, ఇండ్లకు తాళాలు ఉండటం తదితర కారణాలతో కొందరి వివరాలను సేకరించలేదని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కులగణన ప్రక్రియ సామాజిక సాధికారతతోపాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీనవర్గాల వారందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని తెలిపారు. సర్వే డాటా ఎంట్రీ పూర్తయిన నేపథ్యంలో ఫిబ్రవరి 2వ తేదీలోగా క్యాబినెట్ సబ్‌కమిటీకి తుది నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను ఏంచేద్దాం?

- ముందుగా సర్పంచ్ ఎన్నికలు పెడ్దామా.. జడ్పీటీసీ, ఎంపీటీసీలకు వెళ్దామా?
- ఎన్నికలపై అధికారులతో సమీక్షించిన సీఎస్

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంట్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఏ ఎన్నికలు పెట్టాలన్నదానిపై సీఎస్ అధికారులతో చర్చించినట్టు తెలిసింది. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలా.. లేక మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించాలా..? అన్నదానిపై ప్రధానంగా చర్చించినట్టు తెలిసింది. అయితే, దేనిపైనా స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికలకు అయితే సిద్ధంగా ఉండాలని చెప్పినట్టు తెలిసింది. తాత్కాలిక షెడ్యూల్ కూడా సిద్ధం చేసుకోవాలని సూచించినట్టు సమాచారం. పంచాయతీ ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికలకు కూడా సిద్ధంగా ఉండాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. రాష్ట్రంలో పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికలతోపాటు త్వరలో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో సీఎస్ సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

భూసంస్కరణలపై సలహాలకు ప్రత్యేక కమిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భూ సంస్కరణలను కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీసీఎల్‌ఏ కార్యాలయంలో అనుబంధంగా ల్యాండ్ గవర్నెన్స్ ఇన్నోవేషన్ అండ్ లీగల్ సపోర్ట్ సెల్ ఏర్పాటు చేస్తూ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూన్యాయ చట్టాలు, రెవెన్యూ అంశాల్లో నిపుణులైన ముగ్గురికి కమిటీలో చోటు కల్పించనున్నారు. ఇందులో ఒకటి చీఫ్ లీగల్ అడ్వైజర్ పోస్ట్ కాగా రెండు లీగల్ అడ్వైజర్ పోస్టులు ఉన్నాయి. రెవెన్యూ చట్టాన్ని మెరుగుపరిచేందుకు సలహాలు, సూచనలు ఇస్తారు. పాలసీలు, చట్టాలు, నియమనిబంధనలు, ఉత్తర్వుల రూపకల్పనలో సాయం చేస్తారని ప్రభు త్వం పేర్కొంది. భూ వివాదాలకు సంబంధించి పెండింగ్ కేసుల్లో ప్రభుత్వానికి న్యాయపరమైన సలహాలు అందిస్తారు.

కీచక ఉపాధ్యాయులకు దేహశుద్ధి

- చితకబాదిన తల్లిదండ్రులు, గ్రామస్థులు
- బాలికలతో మాట్లాడిన ఎంఈవో అనితాదేవి

ఉపాధ్యాయుడిని చితకబాదుతున్న తల్లిదండ్రులు

తొర్రూరు, జనవరి 29: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్థులు స్కూల్‌ను ముట్టడించారు. ఈ విషయంపై బుధవారం ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురించగా వారు పెద్ద సంఖ్యలో పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులను నిలదీశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు టీచర్లను చితకబాదారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులు, గ్రామస్థులకు సర్ది చెప్పారు. ముగ్గురు టీచర్లను తొర్రూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణాధికారిగా మరిపెడ ఎంఈవో అనితాదేవి పాఠశాలను సందర్శించి బాలికల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయనున్నట్టు తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ మళ్లీ చేపట్టాలి

రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 29: అర్ధరాత్రి దొంగలు, నక్సలైట్లను నిర్బంధించినట్టు ప్రశ్నించే గొంతుకలను నిర్బంధించి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి, మళ్లీ ప్రజల సమక్షంలో చేపట్టాలని ఎన్టీపీసీ యాజమాన్యాన్ని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే కేవలం అధికారపార్టీ నాయకులు మాట్లాడడమా..? లేక ప్రతిపక్ష పార్టీలు మాట్లాడకుండా అరెస్టు చేయడమా..? అని ప్రశ్నించారు. పోలీస్ నిర్బంధంలో ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీలో 2400 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్ కోసం మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ పోలీస్ పహారాలో, ప్రజలు లేకుండా జరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమానికి నేతలు రాకుండా అక్రమ అరెస్టులు చేశారని ఆగ్రహించారు. రామగుండంలో నిర్బంధపాలన కొనసాగుతున్నదని వాపోయారు. నాడు ఎన్టీపీసీ ప్లాంట్ ఏర్పాటుకు భూములను త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు నేటివరకు విద్య, వైద్యం, ఉద్యోగావకాశాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని, పైగా బెదిరింపులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు.

ఏసీపీపై కాంగ్రెస్ ఎమ్మెల్యే దౌర్జన్యం!

- మక్కాన్‌సింగ్ వాహనం ఆపిన పోలీసు అధికారి
- నా కారును ఆపిందెవడంటూ ఎమ్మెల్యే చిందులు
- ఇది కాంగ్రెస్ రాజ్యమంటూ ఘర్షణకు దిగిన నేతలు

ఏసీపీ జాన్ నర్సింహులుతో వాదనకు దిగుతున్న కాంగ్రెస్ నాయకుడు

పెద్దపల్లి, జనవరి 29 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఓ పోలీసు అధికారిపై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దౌర్జన్యంగా ప్రవర్తించారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు విస్తరణ కోసం 600 ఎకరాల భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణను మంగళవారం పెద్దపల్లి జిల్లా రామగుండంలోని జ్యోతినగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఆయన అనుచరులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. ప్రజాభిప్రాయ సేకరణ వీఐపీ గేట్ వద్దకు ఎమ్మెల్యే తన కాన్వాయ్‌తో లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా అక్కడ డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులు అడ్డుకున్నారు. వాహనంలో ఉన్న ఎమ్మెల్యేకు నమస్తే చెప్పి లోపలికి అందరినీ అనుమతించడం లేదని, ఒక్కరే వెళ్లాలని సూచించారు. ఆగ్రహించిన ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఏసీపీపై తిరగబడ్డారు. ‘నా వాహనాన్ని ఆపిందెవడు..?’ అంటూ ట్రాఫిక్ ఏసీపీపై మక్కాన్ సింగ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇది కాంగ్రెస్ రాజ్యం అంటూ ఆయన అనుచరులు ఏసీపీపై దాడికి ప్రయత్నించారు. దీంతో “నా డ్యూటీ నేను చేస్తున్నా. ఏం చేస్తారు..? మహా అంటే బదిలీ చేస్తారు. అంతేగా నేను మాత్రం మీకు గౌరవమిస్తున్నాను. మీరు మాత్రం అలా మాట్లాడుతున్నారు” అంటూ తేల్చి సమాధానం చెప్పారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. కాంగ్రెస్ నేతల దురుసు ప్రవర్తనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. విధుల్లో ఉన్న అధికారిపై ఎమ్మెల్యే దౌర్జన్యం సరికాదని మండిపడుతున్నారు.

బీఆర్ఎస్ బంద్ పిలుపు... ఎక్కడికక్కడ అరెస్టులు

ప్రజల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాకే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రామగుండం బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో 780 మంది పోలీసుల పహరా మధ్య ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. కార్యక్రమం ప్రారంభానికి ముందే రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను అరెస్టు చేసి, మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను నిర్బంధించారు.

గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనం పూర్తి

ఫిబ్రవరిలో జీఆర్ఎల్ విడుదల

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తయ్యింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించగా, 31,383 మందికి 21,151 (67.3శాతం) హాజరయ్యారు. ఒక జవాబుపత్రాన్ని ఇద్దరు ప్రొఫెసర్ల చేత మూల్యాంకనం చేయించారు. ఇద్దరు మూల్యాంకనం చేయగా, సగటు మార్కులను కేటాయిస్తారు. అయితే మార్కుల్లో 15శాతం తేడాలుంటే మూడో ప్రొఫెసర్ చేత మూల్యాంకనం చేయించే అవకాశాలున్నాయి. ఈ ప్రక్రియనంతా పూర్తిచేసి ఫిబ్రవరిలో జీఆర్ఎల్‌ను విడుదల చేయాలని టీజీపీఎస్సీ భావిస్తున్నది. అయితే ఫలితాలను ఆరోహణ క్రమంలో విడుదల చేయాలని కమిషన్ భావిస్తున్నది. గ్రూప్-1తోపాటే గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను సైతం కమిషన్ విడుదల చేయాల్సి ఉంది. తొలుత గ్రూప్-1 ఫలితాలు ప్రకటిస్తే గ్రూప్-2, గ్రూప్-3లో బ్యాక్‌లాగ్స్‌ను నివారించవచ్చన్న ఆలోచనతో ఫిబ్రవరిలో గ్రూప్-1 జీఆర్ఎల్‌ను విడుదల చేయాలని కమిషన్ భావిస్తున్నది. ఈ దిశలో కసరత్తును తీవ్రతరం చేసింది.

ఇంటర్ పరీక్షలను బహిష్కరిస్తాం

- ప్రైవేట్ కాలేజీల హెచ్చరిక
- 3నుంచి ప్రాక్టికల్, మార్చి 5 నుంచి థియరీ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్ కాలేజీలపై ఇంటర్‌బోర్డు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ కాలేజీల యాజమాన్య సంఘాలు తిరుగుబాటు చేశాయి. ఇంటర్ పరీక్షలు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించాయి. సీసీ కెమెరాలు ఏర్పాటుచేయబోమని, థియరీ, ప్రాక్టికల్ పరీక్షలకు సహకరించబోమని స్పష్టంచేశాయి. తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజీ మేనేజ్